# భం గురువాణి



07 మే, 2026 సంచిక-258

## బుద్ధం శరణం గచ్ఛామి

వైశాఖ పౌర్ణమికి ఒక విశిష్టత ఉంది. ఈరోజు ఆధ్యాత్మిక మార్గంలో జ్యోతిగా వెలుగొందిన ఒక మహానుభావుని యొక్క జన్మదినము. ఆ మహానుభావుడు ఎవరో కాదు గౌతమ బుద్ధుడు.అందుకే వైశాఖ పౌర్ణమిని బుద్ధ పౌర్ణమి అని కూడా అంటారు. గౌతమ బుద్ధుని యొక్క జీవితంలో ఒక వైశిష్ట్యం ఉంది. వైశాఖ పౌర్ణమి నాడే ఆయన జన్మించాడు, వైశాఖ పౌర్ణమి నాడే ఆయన జ్ఞానోదయం పొందాడు, వైశాఖ పౌర్ణమి నాడే ఆయన తన శరీరం చాలించాడు. బుద్ధుని యొక్క ఆధ్యాత్మిక జీవితంలోని ఈ మూడు ప్రధాన ఘట్టాలు పౌర్ణమి దినములలోనే జరిగినాయి.

గయలో బోధి వృక్షము క్రింద ధ్యానముద్రలో ఉన్న సమయంలో ఆయనకు హృదయ ప్రకాశం అవుతుంది, ఆత్మ దర్శనం దొరుకుతుంది. అక్కడ అద్భుతమైనటువంటి కోటి సూర్యుల కాంతిని దర్శిస్తాడు ఆయన. ఆయనకు ఉన్నటువంటి సంశయములు అన్ని నివారణం అవుతాయి.

బుద్ధుడు ఆ ఆనందం తట్టుకోలేక నాట్యం చేస్తాడు. అంతవరకు ఆయన సిద్దార్థుడే, కానీ బుద్ధి వికాసం చెందినది కనుక ఇప్పటి నుండి నేను బుద్ధుడను అని అంటాడు ఆయన.

ఆత్మ దర్శనం జరిగిన తర్వాత బుద్ధుడు ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తూ మానవాళికి నాలుగు ఆర్య సూత్రాలను చెబుతాడు. సర్వం దుఃఖం, దుఃఖ సముదాయ, దుఃఖ నిర్మూలనం, దుఃఖ నిరోధ మార్గం అని ఆర్య సూత్రాలను తెలుపుతాడు బుద్ధుడు. తరువాత అష్టాంగాలు అనే పవిత్రమైన మార్గాన్ని ఈ జగత్తుకు చెబుతాడు ఆయన. సమ్యక్ దృష్టి, సమ్యక్ సంకల్పం, సమ్యక్ వాక్కు, సమ్యక్ చరితం, సమ్యక్ జీవనం, సమ్యక్ వ్యాయామం, సమ్యక్ స్మృతి, సమ్యక్ సమాధి. ఈ అష్ట సూత్రాలను బుద్ధుడు మానవాళికి అందించినాడు. బుద్ధుని యొక్క సిద్ధాంతం అద్భుతంగా ఉంది. తరువాత బుద్ధుడు శిష్యులకు ఈ విధంగా చెబుతాడు, నేనొక్కడినే దీనిని అనుభవించి లాభం లేదు. ఈ విద్యను సమాజంలోని అందరికీ నేర్పాలి. ఈ రహస్యాన్ని ప్రతి ఒక్కరు తెలుసుకొని ఆత్మానందాన్ని అనుభవించాలి.

ప్రతి ఒక్కరు ఆత్మసాక్షాత్కారం పొందాలి అని చెప్పి, ధర్మ ప్రచారానికి పూనుకొని, ఆసియా ఖండంలో ఆధ్యాత్మిక మార్గంలో జ్యోతిగా వెలుగొందాడు గౌతమ బుద్ధుడు. కనుక శిష్య భక్తాదులారా మీరందరూ కూడా బుద్ధుడు సూచించిన ధర్మ మార్గంలో ప్రయాణించి మీ యొక్క జీవితాన్ని ధన్యం చేసుకోగలరని ఆశిస్తూ, ఆశీర్వదిస్తున్నాను.

**"బుద్ధం శరణం గచ్ఛామి"**
**"ధర్మం శరణం గచ్ఛామి"**
**"సంఘం శరణం గచ్ఛామి"**